

'బల్దియా'లో ఇన్‌చార్జీల పాలన

- సెలవుల్లో హెచ్‌వోడీలు
- పెండింగ్‌లో ఫైళ్లు

కరీంనగర్ టౌన్, జూన్ 15: కరీంనగర్ నగరపాలక సంస్థలో ఇన్‌చార్జీల పాలన కొనసాగుతోంది. నగరపాలక సంస్థ కమిషనర్‌తోపాటు వివిధ విభాగాల అధిపతులు (హెచ్‌వోడీ) దీర్ఘకాలిక సెలవు పెట్టి వెళ్లిపోయారు. కమిషనర్ బి శ్రీనివాస్ శనివారం నుంచి 15 రోజులపాటు సెలవుపెట్టి వెళ్లారు. ఆయన బాధ్యతలను డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణికి అప్పగించారు.

● నిలిచిన అభివృద్ధి పనులు

ముఖ్యమైన విభాగాలకు చెందిన అధిపతులు సెలవుల్లో వెళ్లడంతో కీలకమైన, అవసరమైన నిర్ణయాలను ఇన్‌చార్జీలు తీసుకోవడం లేదని, కొద్దిరోజులుగా ఫైల్స్ పెండింగ్‌లో ఉంటున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఏడాది జూన్, జూలైలో అన్ని విభాగాల అధికారులతో నగరపాలక సంస్థ కళకళలాడింది. నగరంలో ఎక్కడ చూసినా అభివృద్ధి పనులు జరిగాయి. ఇప్పుడు అంతా ఇన్‌చార్జీలే కావడంతో పెండింగ్ పనులు ఎప్పటికీ పూర్తవుతాయో, కొత్త పనులు ఎప్పటికి ప్రారంభమవుతాయో తెలియడం లేదు. ఓవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో గత ప్రభుత్వంలో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ఖాళీగా ఉన్న పోస్టులన్నింటిని భర్తీ చేసి ఇన్‌చార్జీల పాలనకు తెరదించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- సూపరింటెండింగ్ ఇంజనీర్ నాగమల్లేశ్వర్‌రావును చాలా రోజుల క్రితమే సెలవు పెట్టి వెళ్లిపొమ్మని కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఆయన బదిలీపై వెళ్లిపోయారు. ఆయన స్థానంలో కొత్తవారికి పోస్టింగ్ ఇవ్వక పోవడంతో ఈఈ మహేందర్‌కు ఎస్‌ఈ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు.
- ఇంజనీరింగ్ విభాగంలో మరో కీలకమైన పోస్టు ఈఈగా పనిచేసిన కిష్టప్ప బదిలీపై వెళ్లారు. జగిత్యాల మున్సిపాలిటీలో డీఈఈగా పనిచేస్తున్న రొడ్డ యాదగిరికి ఇన్‌చార్జి ఈఈగా బాధ్యతలను అప్పగించారు.
- మరో కీలకమైన విభాగం టౌన్‌ప్లానింగ్.. ఈ విభాగం హెడ్ డిప్యూటీ సిటీ ప్లానర్ యెల్ల సుభాష్ నెలరోజులపాటు సెలవు పెట్టారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పని చేస్తున్న భానుచందర్‌కు డీసీపీ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు.
- నగరపాలక సంస్థలో కీలకమైన మరో పోస్టు సానిటరీ సూపర్‌వైజర్.. నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రధాన సేవలందించాల్సిన నగరపాలక సంస్థలో డాక్టర్ లేరు.. ఒకే ఒక హెల్త్ సూపర్‌వైజర్ రాజమనోహర్ ఉండగా ఆయన కూడా ఇటీవలనే సెలవులో వెళ్లారు. అసిస్టెంట్ కమిషనర్‌కు సానిటేషన్ బాధ్యతను అదనంగా అప్పగించారు.

● కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి?

ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం కూడా మరో ఆరు మాసాల్లో ముగియనుండడంతో ప్రజలకిచ్చిన హామీలన్ని నెరవేరుతాయని, మళ్లీ ఓట్ల కోసం ఎలా వెళ్లేదని కార్పొరేటర్లు ఆందోళన చెందుతున్నారు. కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించి, ముఖ్యశాఖల హెచ్‌వోడీలను నియమించాలని వారు కోరుతున్నారు. ఐఏఎస్‌ల బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్‌గా వరంగల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న రాధికా గుప్తా వస్తారనే ప్రచారం జరుగుతోంది.

కలెక్టర్‌గా అనురాగ్ జయంతి

- రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి బదిలీపై రాక



కరీంనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా కలెక్టర్‌గా అనురాగ్ జయంతి నియమితులయ్యారు. ఇక్కడ కలెక్టర్‌గా పని చేస్తున్న పమేలా సత్పతిని బదిలీ చేసి ఆమె స్థానంలో ఈయనను పోస్టు చేశారు. 2015 బ్యాచ్‌కు చెందిన అనురాగ్ జయంతి రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా తనదైన ముద్ర వేశారు. పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టి, వినూత్న కార్యక్రమాలతో తనదైన మార్కును చూపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆయన చేపట్టిన పలు కార్యక్రమాలు ప్రజల ప్రశంసలు పొందాయి. ఆయన ప్రస్తుతం జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన జిల్లాలోనూ వినూత్న కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వ కార్యాలయాల్లో పనితీరును మెరుగు పరిచి అభివృద్ధిని పరుగులెత్తించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

బోనస్‌పై రైతన్నల ఆశలు

- సన్నాల సాగుకే మొగ్గు
- వానాకాలం సీజన్‌లో మారిన పరిస్థితి



నగునూర్‌లో నారు మడి కోసం దున్నిన భూమి

కరీంనగర్ రూరల్, జూన్ 15: వానాకాలం సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటికే నారుమడులు సిద్దం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకాల వడ్లకు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రకటించడంతో రైతులు ఈసారి సన్నాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో మార్కెట్‌లో సన్న రకాల విత్తనాలకు డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే రైతులు సాగు పనులు ముమ్మరం చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో సన్న రకాలైన జైశ్రీరాం, బీపీటీ, తెలంగాణ, సోనా, కావేరి విత్తనాలను రైతులు ఎక్కువగా కొంటున్నారు.

● పెరగనున్న సాగు విస్తీర్ణం

కరీంనగర్ రూరల్ మండలంలో వానాకాలం సీజన్‌లో మొత్తం 13,600 ఎకరాల్లో వరిపంట సాగు చేస్తారు. సాధారణంగా ప్రతీ సీజన్‌లో రైతులు దొడ్డు రకం వరిని ఎక్కువగా సాగు చేస్తుంటారు. దొడ్డు రకం వరికి దోమపోటు రాదు, 15 రోజుల ముందే కోతకు వస్తుంది. సన్నాల కంటే ఎక్కువగా దిగుబడి వస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో దొడ్డురకాలనే ఏ గ్రేడ్‌గా నిర్ణయిస్తారు. ఈదురు గాలులు, వడగండ్ల వానలకు గింజ రాలిపోదనే ధైర్యంతో రైతులు సాగు చేస్తుంటారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ నుంచి సన్న ధాన్యానికి 500 రూపాయల బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు సన్నాల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ప్రధానంగా చెర్లబూత్కూర్, చామనపల్లి, ఇరుకుల్ల, మొగ్దుంపూర్, గోపాల్‌పూర్, ఎలబోతారం, జూబ్లీనగర్‌లో సన్నాలు సాగు చేస్తారు. ఈ సీజన్‌లో మొత్తం 2,500 ఎకరాల వరకు రైతులు సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. కాని ఇది ఐదు వేల ఎకరాల వరకు పెరిగే అవకాశం ఉంది.

అందుబాటులో వరి విత్తనాలు

- బి సత్యం, మండల వ్యవసాయాధికారి



వానాకాలం సీజన్‌లో రైతులకు సరిపడా వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఈ సారి సన్నాల సాగు పెరిగే అవకాశం ఉండటంతో సన్నరకాల విత్తనాలను రైతులకు అందించేందుకు చర్యలు తీసుకున్నాం.

పునరావాసానికి ఎదురు చూపులు

- ప్రతి వర్షాకాలంలో ఇబ్బందులు
- ఏళ్లు గడిచినా అందని పరిహారం
- రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలంటున్న నారాయణపూర్ ముంపు గ్రామాల ప్రజలు

గంగాధర, జూన్ 15: చొప్పదండి నియోజకవర్గం నారాయణపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల ప్రజలు పునరవాసం, పరిహారం కోసం ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చడం లేదు. మెట్ట ప్రాంతమైన చొప్పదండి నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు సాగునీరందించేందుకు 2005లో గంగాధర మండలం నారాయణపూర్ చెరువును రిజర్వాయర్‌గా మార్చాలని అప్పటి ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ రిజర్వాయర్‌లో నారాయణపూర్, మంగపేట, చర్లపల్లి(ఎన్) గ్రామాలు ముంపునకు గురువుతాయి. నారాయణపూర్ చెరువు కట్టను ఆనుకుని ఉన్న ఇళ్లు, రిజర్వాయర్ బ్యాక్‌వాటర్‌తో మంగపేట, చర్లపల్లి(ఎన్) గ్రామాల్లో కొన్ని ముంపునకు గురుతున్నాయని అధికారులు గుర్తించారు.



వాగు దాటుతున్న ఇస్తారుపల్లి గ్రామస్థులు(ఫైల్)



నారాయణపూర్ గ్రామం

రిజర్వాయర్‌లో ముంపునకు గురైన నారాయణపూర్ గ్రామానికి చెందిన రైతుల భూములకు పరిహారం అందించాల్సి ఉంది. రిజర్వాయర్‌లోకి ఎల్లంపల్లి నీటిని నింపి ఇక్కడి నుంచి కొడిమ్యాల మండలం పోతారం చెరువులోకి పంపుల ద్వారా నీటిని ఎత్తి పోస్తారు. రిజర్వాయర్‌లోకి నీరు వచ్చిన ప్రతిసారి నారాయణపూర్ గ్రామస్థులు బిక్కు బిక్కుమంటు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గడుపుతారు. రిజర్వాయర్ నీటిలో నుంచి పాములు, విషపురుగులు ఇండ్లలోకి వస్తుంటాయి, చెరువు కట్టను ఆనుకుని ఉండడంతో గ్రామంలో 50 శాతం ఇళ్ల గోడలు పదనెక్కుతాయి. ఇళ్ల ముందు ఊటపడి నీరు వస్తుంది. వర్షకాలం నాలుగు నెలలు ప్రాణాలు అరచేతులో పెట్టుకుని గడపాల్సి వస్తుంది. బ్యాక్ వాటర్‌తో మంగపేట, చర్లపల్లి(ఎన్) గ్రామాల్లోని ఇళ్లలోకి నీరు చేరుతుంది. ఈ బాధలు తట్టుకోలేక ఇప్పటికే నారాయణపూర్, చర్లపల్లి, మంగపేట గ్రామాల్లోని కొన్ని కుటుంబాలు ఊరు విడిచి వెళ్లాయి. ప్రతి ఏటా ముంపుగ్రామాలుగా ప్రకటించి, పరిహారం అందించాలని ఆందోళన చేసినా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదు. ఆందోళన చేసినప్పుడు అధికారులు సర్వేల పేరుతో గ్రామాల్లోకి వచ్చి సమావేశం నిర్వహించి వెళతారు.

నూతన చట్టాలపై అవగాహన కల్పించాలి

- డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వెంకటేశ్వర్లు

కరీంనగర్ లీగల్, జూన్ 15: కేంద్ర ప్రభుత్వం మార్పులు, చేర్పులతో ప్రవేశపెట్టిన నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వింజమూరి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా అడిషనల్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మొదటి శనివారం పోలీస్ అధికారుల సమీక్షా సమావేశంలో వారికి నూతన చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మూడో శనివారం ప్రాసిక్యూటర్ల సమావేశం నిర్వహించాలని సూచించారు. ప్రాసిక్యూటర్లు కేసుల విచారణ సమయంలో ఆయా కేసులపై పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. అనంతరం పెద్దపల్లి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి రాకేశ్ నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జ్యోతిరెడ్డి, లక్ష్మిప్రసాద్, నర్సింగరావు, అరెల్లి రాములు, జూలూరు శ్రీరాములు, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మన్, శరత్, పెంట శ్రీనివాస్, కాసారపు మల్లేశం, జంగిలి మల్లికార్జున్, సీనియర్ ఏసీపీ మురళీధర్‌రావు, వసంత పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారులు

సుభాష్‌నగర్, జూన్ 15: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గొర్రెలు, మేకల పెంపకం దారులు కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం కరీంనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు సందబోయిన ప్రసాద్ మాట్లాడుతూ పలువురు గొర్రెల కోసం డీడీలు కట్టారని, వారికి వెంటనే నగదు బదిలీ చేయాలని కోరారు. గొర్రెల పంపిణీపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకుండా డీడీలు తిరిగి ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఏడు సంవత్సరాలుగా జిల్లాలో ప్రాథమిక సహకార సంఘం ఎన్నికలను నిర్వహించడంలేదని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. గొల్ల కురుమలకు మటన్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం ప్రభుత్వం స్థలం కేటాయించాలని, 559, 1016 జీవోలను వెంటనే అమలు చేయాలని, ప్రతి గ్రామంలో గొర్రెలు మేపుకునేందుకు స్థలం కేటాయించాలని, అర్హులైన గొర్రెల కాపరులకు ఐదు వేల రూపాయల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కటికరెడ్డి బుచ్చన్న, జంగా కొమురయ్య, గాదం శ్రీనివాస్, రాధారపు కుమార్, ముక్కెర సదానందం, పరశురామ్, జిట్ట కొమురెల్లి, శంకర్, మగ్రి ఐలయ్య, ఆసరి రాజు, భూస రాజు, వేల్పుల కొమురయ్య, ఓదెలు, కనకయ్య, సందబోయిన స్వామి, పీరాల రవీందర్ పాల్గొన్నారు.

మియాపూర్‌లో మహిళ ఆత్మహత్య

సుల్తానాబాద్, జూన్ 15: సుల్తానాబద్ మండలంలోని మియాపూర్ గ్రామానికి చెందిన సీపతి అంజలి(36) అనే మహిళ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మియాపూర్ గ్రామానికి చెందిన అంజలికి కాట్నపల్లికి చెందిన శ్రీనివాస్‌తో 18 ఏళ్ళ క్రితం వివాహం జరిగింది. భార్యభర్తల మధ్య తలెత్తిన విభేదాల కారణంగా కొన్నేళ్ల నుంచి అంజలి మియాపూర్‌లో ఉంటోంది. శనివారం ఉదయం ఉపాధి పనికి వెళ్లి ఇంటికి వచ్చిన అంజలి కొంత సేపటికి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మొదట పెద్దపల్లి అనుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని కరీంనగర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కరీంనగర్‌లో డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించినట్లు మృతురాలి సోదరుడు సతీష్ తెలిపారు. మృతురాలికి భర్తతో పాటు కుమారుడు ఉన్నారు. అంజలి ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు.

రవాణా శాఖ ఆధ్వర్యంలో

వాహనాల తనిఖీలు

తిమ్మాపూర్, జూన్ 15: రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వి ద్యా సంస్థల వాహనాలతో పాటు ఇతర వాహనాల తనిఖీ కొనసాగాయి. శనివారం నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 8 వాహనాలను సీజ్ చేసినట్లు డీటీసీ పురుషోత్తం తెలిపారు. ఇందులో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా నడుస్తున్న విద్యా సంస్థల బస్సులు 3, టాక్స్ లేకుండా నడుస్తున్న వాహ నాలు 4, ట్యాక్స్ చెల్లించని ట్రాక్టర్ ట్రాలీని సీజ్ చేసి జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి తరలించినట్లు డీటీసీ తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఎంవీఐలు జె ప్రమీల, బి స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ


స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

- కిటకిటలాడిన నరసింహుడి ఆలయం

ధర్మపురి, జూన్ 15: ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ విపరీతరంగా పెరిగింది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, అనుబం ధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. క్షేత్ర నలుమూలల నుం చి ఉదయం వరకు భారీగా భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకుని స్వామి ద ర్శనం చేసుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగో లు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పం డితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభి షేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ జాతర


పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, జూన్ 15: మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలను ముదిరాజ్‌ల ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహింస్తున్నారు. శనివారం గ్రామంలో అమ్మవారిని పూర్వ వీధుల గుండా నిర్వహకులు డప్పుచప్పుళ్ల మధ్య ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆల యంలో అమ్మ వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అర్చనలు, హారతి కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భం గా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేంద ర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజి రెడ్డి పాల్గొని అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. నిర్వాహకులు శాలువాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి దీవెనలతో వర్షాలు సమృద్ధిగా కు రిసి పాడి పంటలు పండి గ్రామస్థులు సంతోషంగా ఉండాల న్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగిటి రాజేందర్, రెండ్ల రమేష్, శ్రీనివాస్, జెట్టి లక్ష్మణ్, నరేష్‌రెడ్డి, దొంతుల శ్రీకాంత్, జంగిడి శ్రీధర్, పల్లికొండ వినోద్, పాల్గొన్నారు.

'మైనార్టీ గురుకులాల్లో అక్రమ అడ్మిషన్లను రద్దు చేయాలి'

కరీంనగర్ టౌన్, జూన్ 15: మైనార్టీ గురుకులాల్లో జరుగుతున్న అక్రమ అడ్మిషన్లను రద్దు చేసేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబులు జోక్యం చేసుకోవాలని ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్‌హుస్సేన్ డిమాండ్ చేశారు. 75శాతం ముస్లిం మైనార్టీలతో భర్తీ చేయాల్సిన సీట్లలో నాన్ మైనార్టీలతో భర్తీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ అడ్మిషన్ల వ్యవహారంలో వేలాది రూపా యల చేతులు మారుతున్నాయన్నారు. కరీంనగర్ జిల్లాలోని మైనార్టీ గురుకులా ల్లోనే అక్రమాలు ఎక్కువగా చోటు చేసుకున్నాయని ఆయన ఆరోపించారు. చొప్పదండి నియోజకవర్గానికి చెందిన ఓ పార్టీ నేత ఫోన్‌తో 12 అడ్మిషన్లు ఎలా పొందారో, ఇప్పటికప్పుడు 120 మంది మైనార్టీలు కాని వారిని తీసుకోవాలని టెమ్రీస్ హెడ్ ఆఫీస్ నుంచి ఆదేశాలు ఏ విధంగా జారీ చేశారో ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. మైనార్టీయేతర విద్యార్థులకు అక్రమ అడ్మిషన్లు ఇచ్చి మైనార్టీ గురుకులాలను నిర్వీర్యం చేసే కుట్రలను చూస్తూ ఊరుకోబోమని అహ్మద్‌హుస్సేన్ హెచ్చరించారు. ఈవ్యవహారాన్ని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరొద్దీన్ ఒవైసీ దృష్టికి తీసుకెళ్తామని ఆయన అన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి


ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి

మల్యాల, జూన్ 15: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆలయంలో భక్తులు అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

తాగునీటి కోసం గిరిజనుల కష్టాలు



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న గిరిజనులు

వీర్నపల్లి, జూన్ 15: వీర్నపల్లి మండల పరిధిలో ని రాశిగుట్ట తండా గిరిజ నులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతు న్నా రు. అధికారులు ఏర్పాటు చేసిన ట్యాంకర్ల నీరు సరి పోవడం లేదని గిరిజనులు వాపోతున్నారు. తండా గిరి జనులకు సరిపడా తాగు నీటిని అందించేలా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారు లను వేడుకుంటున్నారు.


నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్


పోగొట్టుకున్న నగదును అందజేస్తున్న ఆటో డ్రైవర్

జగిత్యాల టౌన్, జూన్ 15: రహదారిపై దొరికిన నగదును పోగొట్టుకున్న వ్యక్తికి అందించి ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీ చాటుకున్నాడు. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో లెల్లెల బాలకృష్ణ అనే వ్యక్తి బైక్‌పై వెళుతూ తన జేబులోంచి రూ. 21,100 నగదును పోగొట్టుకున్నాడు. అదే సమయంలో అటుగా ఆటో నడుపుతూ వస్తున్న ఆటో డ్రైవర్ గడ్డం శ్రీనివాస్ రోడ్డుపై పడిఉన్న నగదును గమ నించి విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ రాజమౌళికి అందజేశాడు. పోగొట్టుకున్న వ్యక్తి బాలకృష్ణగా గుర్తించి నగదును ఆటో డ్రైవర్ చేతుల మీదుగా అ ందజేశారు. తన నిజాయితీని చాటుకున్న ఆటో డైవర్‌ను పోలీసులు అభినందించారు.

అప్పుడు 9.8...ఇప్పుడు 10 జీపీఏ

- రీ వెరిఫికేషన్‌తో సవరించిన బోర్డు- ఖని విద్యార్థిని శరణ్యకు 10జీపీఏ


BOARD OF SECONDARY EDUCATION : TELANGANA STATE
S.S.C PUBLIC EXAMINATIONS
Memorandum of Subject Wise Performance for Passed Candidates
TS-AA 135999
ROLL NUMBER 2407105280 MEDIUM ENGLISH PEDDAPALLI
CANDIDATE'S NAME CHAKILAM SHARANYA
FATHER'S NAME CHAKILAM SURESH
MOTHER'S NAME CHAKILAM SHARADA
SCHOOL NAME 16170?-SRISIDDHARTHA GDN SCL M COLONY GPRHANI
DATE OF BIRTH 18-05-2009 ONE EIGHT MAY TWO ZERO ZERO NINE

CURRICULAR SUBJECT	GRADE FA	GRADE SA	OVERALL GRADE	GRADE POINT
FIRST LANGUAGE TELUGU	A1	A2	A1	10
SECOND LANGUAGE HINDI	A1	A2	A1	10
THIRD LANGUAGE-ENGLISH	A1	A2	A1	10
MATHEMATICS	A1	A2	A1	10
SCIENCE	A1	A1	A1	10
SOCIAL STUDIES	A1	A1	A1	10

CO-CURRICULAR AREA	GRADE	GRADE POINT
VALUE EDUCATION & LIFE SKILLS	A+	5
ART & CULTURAL EDUCATION	A+	5
WORK & COMPUTER EDUCATION	A+	5
PHYSICAL & HEALTH EDUCATION	A+	5

బోర్డు సవరించి విడుదల చేసిన శరణ్య మార్కుల మెమో

(ఇన్‌సెట్‌లో శరణ్య)

కోల్‌సిటీటౌన్, జూన్15: ఎస్సెస్సీ బోర్డు తప్పిదంతో ఓ ప్రతిభ కలిగిన విద్యార్థిని 10జీపీఏకు దూరం కావాల్సి వచ్చింది... తొలుత 9.8 జీపీఏగా బోర్డు ప్రకటించగా విద్యార్థి ప్రతిభపై ఉన్న నమ్మకంతో యాజమాన్యం రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోగా మార్కుల్లో తప్పిదం జరిగిందని బోర్డు సరివరించి సరిదిద్దుకుంది.. శనివారం 10జీపీఏ ఉత్తర్వును జారీ చేసింది.పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని సిద్ధార్థ హైస్కూల్‌కు చెందిన పదవతరగతి విద్యార్థిని చకిలం శరణ్యకు రీ వెరిఫికేషన్‌లో 10జీపీఏ సాధించింది. ఈ మేరకు ఎస్సెస్సీ బోర్డు శనివారం సవరించిన మార్కులను విడుదల చేసింది. ఫలితాల్లో 9.8 జీపీఏగా బోర్డు ప్రకటించడంతో పాఠశాల యాజ మాన్యం అనుమానంతో విద్యార్థి ప్రతిభపై ఉన్న నమ్మకంతో బోర్డుకు రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చే సింది. విద్యార్థినికి సైన్స్ మినహా అన్ని సబ్జెక్టుల్లో 10 పాయింట్స్ వచ్చాయి. కాగా రీ వెరిఫికేషన్‌తో 74 మార్కులకు గాను 70గా ముద్రించింది 9.8గా ప్రకటించింది. కాగా ఎస్సెస్సీ బోర్డు జరిగిన తప్పిదాన్ని సవరించి 74గా ప్రకటిస్తూ 10 జీపీఏగా ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.విజయానంద్ తెలిపారు.

వర్షాలు కురువాలని గ్రామదేవతలకు జలాభిషేకం


వెల్లుల్లలోని హనుమాన్‌కు నీటితో అభిషేకం చేస్తున్న మహిళలు

మెట్‌పల్లి రూరల్, జూన్ 15: మండలంలోని వెల్లుల్ల గ్రామం లోని మహిళలు సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో విలసిల్లాలని కోరుతూ శనివారం గ్రామ దేవతలకు జలాభి షేకం చేశారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహిళలు నీళ్ల బిందెలతో గ్రామంలో డప్పు చప్పులతో ఊరేగింప ుగా వెళ్లి పోచమ్మ, మైసమ్మ, శివాల యం, లక్ష్మీనర్సింహ, హనుమాన్ ఆల యాల్లోని ఉత్సవ మూర్తులకు నీటితో అభిషేకం చేసి ప్ర త్యేక పూజలు జరి పారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, గ్రామస్థు లందరూ ఆయురా రోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని దేవుళ్లను కోరుకుంటూ జలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహిం చారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యు లు, గ్రామస్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 15: హకీంపేట ప్రాంతీయ క్రీడా పాఠశాల, కరీంనగర్, ఆదిలాబాద్ పాఠశాలల్లో నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా యువజన క్రీడా అధికారి బి.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మూడో తరగతి పాసై నాల్గవ తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎంపిక విధానం మూడు స్థాయిల్లో జరుగుతుందని పేర్కొన్నారు. మొదట మండల స్థాయిలో ఏడు అంశాలలో పోటీలను నిర్వహి స్తారన్నారు. ఇందులో అర్హత సాధించిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొం టారన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి వారు రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు రాష్ట్రంలోని మూడు క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారన్నారు. మండల స్థాయి ఎంపిక పోటీలు ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు, జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 27వ తేదీన ఉదయం 8గంటల నుంచి డాక్టర్ అంబేద్కర్ స్టేడియం కరీంనగర్‌లో జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 01.09.2015 నుంచి 31.08.2016 మధ్య జన్మించిన వారై ఉం డాలన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి తెలిపారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలి

- వరంగల్ టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ చైర్‌పర్సన్ కేఎన్ గుట్ట

హుజూరాబాద్, జూన్ 15: విద్యుత్ వినియోగదారుల సమస్యలను విద్యుత్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిష్కరిం చాలని వరంగల్ టీఎస్ఎన్‌పీడీసీఎల్ చైర్‌పర్సన్ కేఎన్ గుట్ట అన్నారు. హుజూరాబాద్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ వినియోగ దారుల సమస్యల పరిష్కార వేదిక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ మీటర్ల లోపాలు, ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, హైటల్టేజీ, క్యాటగిరి మార్పిడి, విద్యుత్ సరఫరాలో అంతరాయం, కొత్త సర్వీసులు ఇవ్వడంలో జాప్యం చేయ కూడదన్నారు. విద్యుత్ వినియోగదారుల కోసమే పరిష్కా ర వేదిక నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం పలువురు విద్యుత్ వినియోగదారులు పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. పరిశీలించి పరిష్కరించానలి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చరణ్‌దాస్, నరేందర్, డీఈ లక్ష్మారెడ్డి, ఏఈలు వీరాచారి, శ్రీనివాస్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి చేనేత కార్మికుడి ఆత్మహత్య


వెంకటేశం(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూన్ 15: పనులు లేకపోవటంతో ఆర్థిక ఇబ్బ ందులతో చేనేత కార్మికుడు బొల్లబత్తిని వెంకటేశం(54) శనివారం రైలు కిందపడి కొత్తపల్లి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన వెంకటేశం శనివారం వేకువజామున కొత్తపల్లి రైల్వేట్రాక్‌పై వెళ్తున్న గూడ్స్ రైల్ కింద పడ్డాడు. వెంకటేశం రాజన్న సిరిసిల్లలో పవర్‌లూమ్ కార్మికుడిగా పనిచేస్తుండేవాడు. అక్కడే పనిచేసుకుంటూ వారానికి ఒకసారి ఇంటికివచ్చి తిరిగి వెళ్లేవాడు. 6 నెలల నుంచి అక్కడ పనిలేనందున కొత్తపల్లిలోనే ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. పిల్లల చదువుల కోసం 2 లక్షల అప్పు చేశాడు. పనిలేక మనస్థాపంతో ఉన్న వెంకటేశం తాను సిరిసిల్లకు వెళ్లి పని వెతుక్కుంటానని కుటుంబ సభ్యులకు చెప్పి శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శనివారం ఉదయం కొత్తపల్లి రైల్వేట్రాక్‌పై వెంకటేశం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. వెంకటేశంకు కూతురు, కొడుకు, భార్య ఉన్నారు. కూతురుకు పెళ్ళిచేయలేక, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది వెంకటేశం ఆత్మహత్య చేసుకు న్నాడని మృతుడి భార్య ఇందిర రామగుండం రైల్వే పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి పంచనామా నిర్వహించిన రామగుండం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాటిపల్లిలో రెండిళ్లలో దొంగతనం

మల్యాల, జూన్ 15: మండలంలోని తాటిపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి రెండు ఇళ్లల్లో దొంగతనం జరిగింది. సిరిమల్ల రాజ్యలక్ష్మి ఇంటికి తాళం వేసి శుక్రవారం కుటుం బసభ్యులతో కలిసి తన తల్లిగారి ఇళ్లు ముత్యంపేటకు వెళ్లింది. అయితే శనివారం ఇళ్లు తాళాలు తీసి ఉండడంతో స్థానికులు సమాచారం అందించారు. రాజ్యలక్ష్మి, కుటుంబ సభ్యులు వచ్చి చూసే వరకు తాళాలు పగులగొట్టి ఉండగా ఇంట్లో బీరువాలోని మూడున్నర తులాల బంగా రు వస్తువులతో పాటు రూ. ఏడు వేలు ఎత్తుకెళ్లారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన దాసరి లక్ష్మినారాయణ ఇంట్లో కూడా చోరీ జరిగింది. ఇంట్లో అద్దెకుంటున్న పిల్లి తిరుపతి గదితో పాటు లక్ష్మినారాయణ ఇంట్లోనూ తాళం పగులగొట్టి బీరువాలోని తులం బంగా రు ఆభరణాలు, 11 తులాల వెండి వస్తువులతో పాటు రూ.70వేలు నగదు ఎత్తుకెళ్లిన్నట్లు బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ

తిమ్మాపూర్, జూన్ 15: నర్సింగాపూర్ గ్రామంలోని శ్రీ అది పెరుమాండ్లు హనుమాన్ ఆలయం హుండీని దుండగులు చోరీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ తోట మధు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని శ్రీ ఆది పెరుమాండ్లు హను మాన్ ఆలయములో ఈ నెల 13వ ఆల యానికి వచ్చిన సందర్భంలో హుండీ కనిపించకపో వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బైక్‌పై నుంచి పడి ఒకరి మృతి

మేడిపల్లి, జూన్ 15: ద్విచక్ర వాహనం పై నుంచి పడి సట్ల రాజేందర్(40) అనేవ్యక్తి మృతి చెందాడు. వల్లపల్లి గ్రామానికి చెందిన రాజేందర్ భార్య జల, పిల్లలతో తన పుట్టింటికి పోరుమల్ల వెళ్లింది. శుక్రవారం అర్ధరాత్రి రాజేందర్ భార్యకు ఫోన్ చేసి తాను పోరుమల్ల గ్రామా నికి వస్తున్నానని చెప్పాడు. భార్య రాత్రి ప్రయాణం వద్దని శనివారం ఉదయం రావాలని చెప్పింది. భార్య మాట వినకుండా రాజేందర్ బైక్‌పై పోరుమల్లకు వెళు తుండగా కట్లకుంట గ్రామం శివారులో మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో రాజేం దర్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం అటుగా వెళ్లిన వారు గమనించి కుటంబీకులకు సమాచారం అందిచారు. భార్య జల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మని ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

వెల్గటూర్, జూన్ 15: కప్పారావుపేటలో జరిగిన దాడి సంఘటనలో ఎస్సీ ఎస్టీ కేసు నమోదైన ముగ్గురు నిందితులు పరారీలో ఉండగా శనివారం వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. కప్పారావుపేటకు చెందిన గాజుల లచ్చయ్య, గాజుల రాకేష్‌లపై గత నెల 4న బీరు సీసాలతో దాడి చేసిన సంఘటనలో ముం జంపల్లికి చెందిన బైరం తరుణ్, బైరం కరుణ్ పనుగంటి మధుకర్ పరారీలో ఉన్నారు. శనివారం ముగ్గురు నిందితులను పట్టుకుని అరెస్ట్ చేసి ధర్మపురి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్లు ఎస్సై పేర్కొన్నారు. మెజిస్ట్రేట్ ముగ్గరికి 14 రోజుల రిమాండ్ విధించగా కరీంనగర్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

బ్రిడ్జికి పొంచి ఉన్న ముప్పు

- తాత్కాలిక రోడ్డు కోసం వేసిన ఇసుకను తొలగించని అధికారులు
- వరద వస్తే కూలి పోయే ప్రమాదం


తాత్కాలిక రోడ్డు కోసం వేసిన ఇసుక

గంగాధర, జూన్ 15: అధికారుల నిర్లక్ష్యంతో బ్రిడ్జికి ప్రమాదం పొంచి ఉంది. గత ఏడాది దసరా పండుగ సందర్భంగా బతుకమ్మలు వేయడా నికి ఈ బ్రిడ్జి నుంచి కిందకు వెళ్లేందుకు తాత్కాలికంగా ఇసుక వేసి రోడ్డు వేశారు. అనంతరం దాన్ని తొలగించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురిసి భారీగా వరదనీరు చేరితే ఇబ్బందులు తలెత్తనున్నాయి. గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో బ్రిడ్జి గంగాధర, పెగడపెల్లి మండలాలకు వారధిగా ఉంటుంది. నిత్యం ఈ రహదారిపై నుంచి పెద్ద సంఖ్యలో వాహనాలు కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. గతేడాది ఎగువన కురిసిన వర్షాలకు రిజర్వాయర్ మత్తడి నుంచి భారీగా వరద రావడంతో బ్రిడ్జి కొట్టుకు పోయింది. దీంతో వారం రోజుల పాటు రాకపోకలు నిలిచి పోయాయి. శిథిలావస్థలో ఉన్న ఈ బ్రిడ్జికు అధికారులు మరమ్మతులు చేయించాలని, తా త్కాలికంగా వేసిన ఇసుకను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

రామడుగు, జూన్ 15: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రా మానికి చెందిన కత్తెరపాక కనుకయ్య (45) అనే రైతు చి కిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ సురేందర్ తెలి పిన వివరాల ప్రకారం.. దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన కనుకయ్య ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్య వసాయం చేస్తున్నాడు. గత సంవత్సరం కురిసిరన అకా ల వర్షానికి పంట నష్టం వాటిల్లింది. పెట్టుబడులు సైతం రాలేదు. అంతకు ముందు ఉన్న అప్పు వడ్డీతో కలిసి సుమారు 8లక్షల రూపాయలు వరకు పెరిగి పోయింది. అప్పుఎలా చెల్లించాలనే మనస్తాపంతో గత నెల 30న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికి త్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. కనుకయ్య భార్య మణెమ్మ ఫిర్యాదు మే రకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారుల నిరసన

హుజూరాబాద్, జూన్ 15: హుజూరాబాద్ పట్టణంలోని బీసీ హాస్టల్ ఎదుట మున్సిపాలిటీ నిర్మించిన షెటర్లకు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని పలువురు వ్యాపారులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం డబ్బులు వేసుకొని ఉపాధి పొందుతున్నామని చెప్పారు. అప్పటి మున్సిపల్ చైర్మన్ షెటర్ల నిర్మాణం చేపడుతా మని డబ్బులు తీసుకొని సగంలోనే వదిలేశారని వాపోయారు. మిగితా షెటర్ల నిర్మాణం పనులను తామే సొంత డబ్బులతో నిర్మించుకున్నామన్నారు. గత పదిరోజు లుగా మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఒక్కో షెటర్‌కు రూ. 50వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయం మున్సిపల్ కమిషనర్‌కు చెప్పిన పట్టించుకోవడం లేదన్నారు. డబ్బులు ఇవ్వకుంటే పాలకవర్గం వేరే వ్యక్తులకు షెటర్లను అప్పగిస్తామని తరుచూ బెదిరిస్తున్నా రన్నారు. రోజు కూలీ చేసుకునే తమను డబ్బుల కోసం పాలకవర్గ సభ్యులు బెదిరించడం సరికాదన్నారు. మున్సిపల్ అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, ప్రదీప్, అంకూస్, రఘుచారి, రమేష్, రవీందర్, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి

- వెయ్యి మంది విద్యార్థుల కష్టాలు పట్టని పాలకులు
- వానాకాలం వచ్చిందంటే మోకాలిలోతు నీటిలో నడవాల్సిందే


అధ్వానంగా ఉన్న స్కూల్‌కు వెళ్లే దారి

కథలాపూర్, జూన్ 15: కస్తూర్బాగాంధీ, మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లాలంటే ఉన్నది ఒకే ఒక దారి. వానాకాలం వచ్చిందంటే చదువుకునేందుకు వెళ్లాలంటే విద్యార్థులకు చుక్కలు కనిపి స్తున్నాయి. ఉధృతంగా వచ్చే వరద నీరు చూసి విద్యార్థులు భయ పడి పాఠశాలకు రోజుల తరబడి గైర్హాజరవుతున్నారు. దీంతో చదువులో వెనకబడిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని విద్యార్థుల తల్లిదం డ్రులు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. ఈ రోడ్డును బాగు చేస్తామని చెప్పడమే గానీ ఏ నాయకుడు కూడా నిధులు కేటాయిం చడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

● విద్యార్థుల అవస్థలు..

ఈ రోడ్డు వెంట వెళ్తేనే తప్ప పాఠశాలకు చేరుకోని పరిస్థితి నెలకొనడంతో వరదను సైతం లెక్క చేయడం లేదు. వరుసగా వర్షాలు కురిస్తే పైభాగం నుంచి భారీ వరద వచ్చి పాఠశాలల్లో చేరుతుంది.


మోకాలి లోతు నీటిలో స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

దారి వెంట మోకాలి లోతు వరద నీటిలో నడుచుకుంటూ కిలోమీటర్ దూరం వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటుంది. ఎన్నో సార్లు ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఈ విపత్కర పరిస్థితిని చూసినప్పటికీ స్పందించకపో వడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. మోడల్ స్కూల్‌లో 500 మంది, జూనియర్ కళాశాలలో 250, కస్తూర్బాగాంధీ పాఠశాలలో 250 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రతీరోజు వెయ్యి మంది వివిధ ప్రాంతా ల నుంచి వచ్చే విద్యార్థులు ఈ దారి వెంటే నడుస్తున్న నేపథ్యంలో రోడ్డును బాగు పరచడంలో శ్రద్ధ కనబరచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఉపాధ్యా యులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. పరీక్షల సమయంలో వరదలోనే నడిచి విధిలేని పరిస్థితుల్లో పరీక్షలకు హాజరు కావాల్సి వస్తోందని వాపోతున్నారు. మండల సర్వసభ్య సమావేశాల్లో కూడా ఈ సమస్యపై చర్చ జరిగినప్పటికీ ఇంజినీర్లు సర్వేలు చేయడంలో అలక్ష్యం ప్రదర్శిస్తున్నట్టు తెలుస్తోంది.

రోడ్డును బాగు చేయాలి..



విద్యార్థులు ఏటా వర్షాకాలంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. వానలు కురిసిన సందర్భాల్లో రోజుల తరబడి పాఠశాలకు రాని పరిసి తి ఉంది. కళాశాల, పాఠశాల ఆవ రణలో నీరు నిలిచి ఉండడంతో తరగ తుల నిర్వాహణకు ఆటంకం ఏర్పడు తోంది. రోడ్డు వెంట సిమెంట్‌తో కాలువ నిర్మించి మధ్యలో కల్వర్టులు నిర్మిస్తే సమస్య పరిష్కారం కావ డానికి అవకాశం ఉంది.

- రాయికంటి శేఖర్, కథలాపూర్

మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల జిల్లా అధ్యక్షుడిగా రవీందర్



ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న రవీందర్

కరీంనగర్ అర్బన్, జూన్ 15: మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల జిల్లా అధ్యక్షుడిగా కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు పిట్టల రవీందర్ ఏకగ్రీవ ఎన్నికయ్యారు. జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఎన్నికల కోసం శుక్రవారం కరీంనగర్ జిల్లా మత్స్యశాఖ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో నామినేషన్ల ప్రక్రియ నిర్వహించగా 11మంది డైరెక్టర్లకుగాను 11 దరఖాస్తులు వచ్చాయి. దీంతో 11మంది డైరెక్టర్లు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి చెరుకు మనోజ్‌కుమార్ ప్రకటించారు. డైరెక్టర్లు అందరూ కలిసి అధ్యక్షుడిగా పిట్టల రవీందర్‌ను, ఉపాధ్యక్షుడిగా పెసరు కుమారస్వామిని ఎన్నుకున్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, డైరెక్టర్లకు ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ నియామక పత్రాలను అందజేశారు. అధ్యక్షుడిగా పిట్టల రవీందర్ ముదిరాజ్(బద్దిపల్లి), ఉపాధ్యక్షులుగా పెసరు కుమార స్వామి ముదిరాజ్(వెన్నంపల్లి), డైరెక్టర్లుగా మోటం వెంకటేష్ ముదిరాజ్(వీణవంక), పప్పు సమ్మయ్య ముదిరాజ్ (అన్నారం), గుండ కుమార్ ముదిరాజ్(గట్టుబుత్కూర్), గొడుగు సమ్మయ్య ముదిరాజ్ (చెల్పూర్), అరిగే ప్రభాకర్ ముదిరాజ్(ముత్తారం), బోల్ల సుధాకర్ ముదిరాజ్(జమ్మికుంట), జక్కుల బాబు ముదిరాజ్(ముదిమాణిక్యం), భాషవేణి శ్రీనివాస్ ముదిరాజ్ (వన్నారం), రేగుల రాజేందర్ ముదిరాజ్ (ఆచంపల్లి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ విజయ కిరణ్ కర్, మంజుల, అధికారులు పాల్గొన్నారు.

'స్వప్నం రాల్చిన అమృతం' నాటికకు బహుమతులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 15: ఈనెల 12 నుంచి 14 వరకు హర్ష క్రియేషన్స్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి నాటిక పోటీల్లో చైతన్య భారతి కరీంనగర్ వారు ప్రదర్శించిన 'స్వప్నం రాల్చిన అమృతం' నాటికకు ఉత్తమ ప్రదర్శనా బహుమతితో పాటు ఉత్తమ నటిగా జ్యోతి, ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సాయి సుప్రియ, ఉత్తమ సంగీతంకు గాను సురభి నాగరాజు బహుమతులు గెలుచుకున్నారని సంస్థ అధ్యక్షుడు తిప్పర్తి ప్రభాకర్ తెలిపారు. ఈ నాటికను పరమాత్ముని శివరాం రచించగా మంచాల రమేశ్ దర్శకత్వం వహించారు. ఈ నాటికలో కొత్తకొండ సత్యనారాయణ, సాయి సుప్రియ, జ్యోతి నటించగా ఆహార్యం, రంగాలంకరణ కేదారి నాగు వ్యవహరించారని దర్శకుడు మంచాల రమేశ్ తెలిపారు. బహుమతులు రావడం పట్ల పలు కళా సంస్థల బాధ్యులు, విద్యుత్ అధికారులు, ఉద్యోగులు, కళాకారులు విజేతలను అభినందనలు తెలిపారు.

'కిసాన్ సమ్మేళన్'ను విజయవంతం చేయాలి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

జమ్మికుంట రూరల్, జూన్ 15: జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో మంగళవారం వారణాసి నుంచి వర్చువల్‌గా నిర్వహించనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కిసాన్ సమ్మేళన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కేవీకేలో కిసాన్ సమ్మేళన్ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు వెంకటేశ్వర్‌రావు, ప్రభాకర్, అనిల్, ప్రశాంతి, నాయకులు శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, పల్లపు రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

చొప్పదండి, జూన్ 15: కాట్నపల్లి జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థి కడారి అభినవేశ్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్‌నకు ఎంపికవడంతో శనివారం పలువురు అభినందించారు.. ప్రస్తుతం అభినవేష్ ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఎంపికైన విద్యార్థికి ఇంటర్ వరకు ఏటా 12వేల రూపాయలు అందజేస్తారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మోహన్ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

హుజూరాబాద్‌రూరల్, జూన్ 15: ప్రస్తుతం శాస్త్రీయ సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, విద్యార్థులకు దానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటే మెరుగైన భవిష్యత్తు ఉంటుందని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె. శంకర్ అన్నారు. శనివారం మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.

కేంద్ర సహాయ మంత్రిని కలిసిన నాయకులు

సైదాపూర్, జూన్ 15: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను శనివారం సైదాపూర్ మండల బీజేపీ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌రెడ్డి ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు.

ఇల్లందకుంట: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను శనివారం ఢిల్లీలోని వారి కార్యాలయంలో ఇల్లందకుంట బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జూన్ 15: నగర ప్రజలకు రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా తమ పాలకవర్గం పని చేస్తుందని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. శనివారం ఆయన 14,32 డివిజన్లలో కార్పొరేటర్లు దిండిగాల మహేశ్, మర్రి భావనతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, సమస్యలపై స్థానికులతో చర్చించారు. నగర పాలక సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో 200 కోట్ల రూపాయలను కేటాయించి అభివృద్ధికి దోహదపడాలని మేయర్ కోరారు. సప్తగిరికాలనీ రాజీవ్ పార్కులో చేపడుతున్న అభివృద్ధి, సుందరీ కరణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనుల్లో వేగం పెంచి నిర్దీత వ్యవధిలో పూర్తయ్యేలా చూడాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. 32వ డివిజన్ కట్ట రాంపూర్‌లో రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ మర్రిభావన సతీష్‌తో కలిసి ప్రారంభించారు. గడిచిన నాలుగున్నరేళ్ళుగా తమ పాలకవర్గం అన్ని రంగాలను అభివృద్ధి చేస్తూ ముందుకు వెళ్తోందని అన్నారు. నగరంలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి 147 కోట్లతో పైపులైన్లు, అదనపు ఫిల్టర్ బెడ్ నిర్మాణ పనులను చేపడు తున్నామని అన్నారు. భవిష్యత్‌లో మంచినీటి సమస్య రాకుండా చూస్తున్నామని చెప్పారు. గ్రామ పంచాయతీ పరిధిలోని కట్టరాంపూర్‌లో అభివృద్ధి పనులను దశల వారీగా పూర్తి చేస్తున్నామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న రోడ్లన్నింటిని పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఈఈ రొడ్డ యాదగిరి, డీఈఈ ఓంప్రకాశ్, వెంకటేశ్వర్లు, ఏఈ చైతన్య, మాజీ కార్పొరేటర్ తుమ్మల రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

'మంత్రిపై నిరాధార ఆరోపణలు'

కరీంనగర్ అర్బన్, జూన్ 15 :మంత్రి పొన్నం ప్రభాకర్‌పై నిరాధార ఆరోపణలు చేస్తే చట్టాన్ని ఆశ్రయిస్తానని నగర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌ఏ మోసీన్ అన్నారు. నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ పట్ల ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి కనీస పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని, పథకాలలో కమీషన్ తీసుకునే సంస్కృతి బీఆర్ఎస్ పార్టీదేనని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు దళితబంధు, బీసీబంధు, మైనార్టీ బంధు పథకాలలో కమీషన్లు తీసుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. బ్లాక్‌మెయిల్ చేసి పబ్బం గడుపుకునేది కౌశిక్‌రెడ్డి అని విమర్శించారు. నిరాధారమైన ఆరోపణలు చేసి నందుకు వెంటనే క్షమాపణలు చెప్పాలని లేకుంటే ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సమావేశంలో నగర మైనార్టీ అధ్యక్షుడు అహమ్మద్‌అలీ, వైస్ ప్రెసిడెంట్ హాజీభాయ్, మహమ్మద్ అమీర్ పాల్గొన్నారు.

వాసవిక్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

సుభాష్‌నగర్, జూన్ 15: వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శనివారం డాన్ టా డిస్క్ పేరుతో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. వాసవి వనిత క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడిని సూచనల మేరకు ఈ కార్యక్రమాలను నిర్వహించినట్లు క్లబ్ బాధ్యులు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం వద్ద రాగిజావ అమ్ముకునే దంపతులకు తోపుడు బండిని అందచేశారు. అనంతరం వాసవీ అమ్మవారికి 250 గ్రాములు వెండిని బహుకరించారు. కార్ఖానగడ్డ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, కంపాస్‌బాక్సులు, బ్యాగులు అందచేశారు. రోడ్డుపై కూరగాయలు విక్రయించేవారికి పెద్ద గొడుగులు అందచేశారు. ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షురాలు బొమ్మిశెట్టి లక్ష్మీకుమారి, నేతి వేణు కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వైస్ గవర్నర్ పబ్బ అరుణ, ఆర్‌సీ నాగరాజు, కార్యదర్శి జంధ్యం మధుకర్, ఐపీసీలు చందా రవీందర్, జైన అర్చన, క్లబ్ అధ్యక్షురాలు చందా విజయలక్ష్మి, కార్యదర్శి నూనె పద్మావతి, కోశాధికారి అనూరాధ పాల్గొన్నారు.

జాతీయవిద్యకు శ్రీఅరవిందులు కృషి

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 15: జాతీయ విద్యలో దివ్యజ్ఞాన ఆధ్యాత్మిక చైతన్యానికి కృషిచేసిన మహనీయులు శ్రీ అరవిందులు అని పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఈ ప్రసాదరావు అన్నారు. శనివారం కరీంనగర్ ఫిలిం భవన్‌లో శ్రీ అరవిందో సొసైటీ తెలంగాణ ప్రాంతీయ సాధన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 అమలులోకి వచ్చిందన్నారు. 120 సంవత్సరాల క్రితం మహర్షి స్వాతంత్ర్య సమరయోధుడు అరవిందులు ఇదే విధానాన్ని ఆరోజే సూచించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అరవిందో సొసైటీ బాధ్యులు ఉప్పుల రామేశం, సబ్బని లక్ష్మీనారాయణ, డాక్టర్ కైరిక దేవరావు, డాక్టర్ కాసం నీలిమ, కోల పవిత్ర బొజ్జ రాజు కోల అన్నారెడ్డి, డాక్టర్ జె ఉమామహేశ్వరి, కోల లావణ్య, మాజీ ఎమ్మెల్సీ ఉచ్చిడి మోహన్‌రెడ్డి, సాహితీవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

భగత్‌నగర్, జూన్ 15: పసిపాపపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని కమాన్ చౌరస్తాలో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ద్యావ అన్నపూర్ణ, చేని రోజా, గాలిపెల్లి స్వరూప, బూసారపు రజిత, ఉప్పునేటి లక్ష్మి పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

భగత్‌నగర్, జూన్ 15: గిరిజన మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టలేని ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని కొత్తపల్లి వైస్ ఎంపీపీ, లంబాడ జేఏసీ చైర్మన్ డిమాండ్ చేశారు. హైదరాబాద్, మియాపూర్, నడిగడ్డ తండాలో బాలికపై అత్యాచారం, ఆపై హత్య చేసి దహనం చేశారన్నారు. బంజారా మహిళలపై, అఘాయిత్యాలు పెరుగుతున్నాయన్నారు. పోలీస్ అధికారులపై చర్యలతో పాటు అట్రాసిటి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలి

భగత్‌నగర్, జూన్ 15: నిర్మించి ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలకు పంపిణి చేయాలని బీకెఎంయు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హత కలిగిన దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలందరికి వెంటనే పంపిణి చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ రేవంత్‌రెడ్డి సర్కారుపై ఉందన్నారు. నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మి పేరుతో ఇంటి నిర్మాణానికి 5 లక్షలు ఇస్తామని ప్రకటించి దరఖాస్తులు తీసుకున్నారన్నారు. వాటి పురోగతి లేదని వెంటనే దరఖాస్తులను పరిశీలించి ఇండ్లు లేని వారికి కేటాయించాలని బీకెఎంయు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ కోరారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులైన వారికి పంపిణీ చేయాలన్నారు.

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు



ఫాదర్స్ డే ప్లకార్డులతో వింధ్యావాలి పాఠశాల విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 15: జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావాలి ఉన్నత పాఠశాలలో ముందస్తుగా శనివారం ఫాదర్స్ డే వేడుకలను నిర్వహించారు. ప్రైమరీ పాఠశాల చిన్నారులకు నిర్వహించిన వేడుకలను పాఠశాల చైర్మన్ రామావరం లక్ష్మీప్రకాశ్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మనలోని లోపాలను సరిచేస్తు భవిష్యత్తుకు పునాదులు వేస్తు మనం గమ్యం చూపేది నాన్న అని అభివర్ణించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ రామావరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి ప్రశాంత్ పాల్గొన్నారు.

రావూస్ పాఠశాలలో..

కరీంనగర్ టౌన్, జూన్ 15: నగరంలోని రావూస్ పాఠశాలలో ముందస్తుగా ఫాదర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ప్రభాకర్‌రావు, సీఈవో నిధిన్‌రావు, ప్రిన్సిపాల్ రహమాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, జూన్ 15: ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలోని సిటి సెంట్రల్ హాల్‌లో నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంఈవోలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చినప్పుడు వారి జీవితం మారు తుందన్నారు. ప్రజా ప్రతినిధిగా మేము, ఉపాధ్యాయులు శ్రద్ధ చూపినప్పుడే వారికి మంచి జరుగుతుందన్నారు. రాష్ట్రంలో గత ఏడాది కరీంనగర్ జిల్లాలో హుజూరాబాద్ నియోజకవర్గంలో పదో తరగతి ఫలితాల్లో అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. పభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని, తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ కను మల్ల విజయ, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, ఎంపీపీ రాణి, జడ్పీటీసీ బక్కారెడ్డి పాల్గొన్నారు.

'ఉపా చట్టాన్ని రద్దు చేయాలి'

హుజూరాబాద్, జూన్ 15: రాజ్యాంగ పరిధిలో పోరాడుతున్న వారిపై ఉపా చట్టం కింద అక్రమ కేసులు పెడుతున్న చట్టాన్ని రద్దు చేయాలని జనసాహితి హుజూరాబాద్ కన్వీనర్ ఆవునూరి సమ్మయ్య, సభ్యులు ముక్కెర రాజు, పల్కల ఈశ్వర్‌రెడ్డి, రవీశంకర్‌శుక్లా శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతులకు అడ్డుకట్టు వేసేందుకు ఆయుధంగా చేసుకుంటూ దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు.

'హనుమాన్ ఆలయాన్ని పునర్నిర్మించాలి'

రామడుగు, జూన్ 15:హనుమాన్ ఆలయాన్ని పునర్నిర్మించాలని కోరుతూ రామడుగు మండలం గోపాల్ రావ పేట గ్రామస్తులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కోరారు. శనివారం వారు ఎమ్మెల్యేను కలిశారు. హనుమాన్ ఆలయం శిధిలావస్థకు చేరడంతో గ్రామ ప్రజలందరూ కలిసి పునర్నిర్మాణం చేయాలని తీర్మానం చేసుకున్నామన్నారు.. ఆ ఆలయం ఉన్న స్థలం తమదే అని మాజీ సర్పంచ్ కర్ర సత్య ప్రసన్న వెంకట రామిరెడ్డి కలెక్టర్‌కు ఇటీవల నేచర్ యూత్ క్లబ్ , కొం త మంది గ్రామస్థులపై ఫిర్యాదు చేశారని అన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్, జూన్ 15: పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలో బలవంతంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ పట్టణాధ్యక్షుడు అనురాగ్ ఆధ్వర్యంలో శనివారం ఎంఈవో నర్సింహారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎంఈవో శ్రీనివాస్‌కు కాకతీయ యూనివర్సిటీ లా విద్యార్థి అన్నం ప్రవీణ్ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, రాజు, రాజేందర్, భాను, దిలీప్, రాజు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడంలేదని యువకుడి ఆత్మహత్యాయత్నం

ఖమ్మం క్రైం, జూన్ 15: ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని త్రీటౌన్ ఆర్‌పీఎఫ్ పోలీసులు కాపాడిన సంఘటన శనివారం సాయంత్రం ఖమ్మం నగరంలో జరిగింది. కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రాంతానికి చెందిన సముద్రాల అనిల్ తన భార్య కాపురానికి రావడంలేదని శనివారం ఖమ్మం వచ్చిన యువకుడు రైల్వే ట్రాక్‌పై చనిపోతున్నానంటు వీడియో తీసి కుటుంబ సభ్యులకు పంపాడు. అది చూసిన తండ్రి వెంటనే జమ్మికుంట పోలీసులను సంప్రదించగా వారు సెల్‌ఫోన్ లోకేషన్ ఖమ్మం రైల్వే సమీపంలోని ట్రాక్ పై చూపించింది. దీంతో పోలీసులు ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేష్ కు సమాచారం అందించారు.

స్పందించిన సీఐ ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం అందించారు. అతడిని కాపాడి స్టేషన్ కు తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక

సైదాపూర్, జూన్ 15: పేద పిల్లలను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన నేషనల్ మీన్స్-కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కుఎక్లాస్‌పూర్ ఉన్నత పాఠశాలకు చెందిన సాదియా, సనాలు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్ట రవీంద్రచారి శనివారం తెలిపారు. విద్యార్థులకు ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు ఏడాదికి 12వేల రూపాయలు ఉపకార వేతనంగా అందుతుందని తెలిపారు.

శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సన్మానం

తిమ్మాపూర్, జూన్ 15: శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులను శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో నిర్వహించిన ఆర్మీ ర్యాలీలో శ్రీ చైతన్య డిఫెన్స్ స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థులు అగ్నివీరులుగా ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డీన్ ఏజీఎం శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్యాంసుందర్ రెడ్డి, పీడీ మహిపాల్‌రెడ్డి, ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కెమెరామన్ రమేశ్‌కు మైత్రీ గ్రూప్ అధినేత ఆర్థిక సహాయం

సుభాష్‌నగర్, జూన్ 15: మైత్రీ ఛానల్ కెమెరామన్ వడ్లూరి నరేశ్ ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుం డగా మైత్రీ గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి ఆయన చికిత్సకు లక్షా 76వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. దుబాయ్ నుంచి జయపాల్‌రెడ్డి నరేశ్ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి పరామర్శించారు. నరేశ్‌కు ఆసుపత్రిలో చికిత్సకు 4 లక్షల రూపాయలు బిల్లు కాగా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ లక్ష రూపాయలను అందించారు. కాంగ్రెస్ నాయకుడు మేనేని రోహిత్‌రావు, టిఎన్‌జీవోస్ నాయకులు రూ.10వేలు, ఫొటో వీడియో జర్నలిస్టు, టౌన్ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు కొంత మంది రిపోర్టర్లు రూ.60వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మిగిలిన బిల్లు మొత్తం లక్షా 76వేల 932 రూపాయలను కొత్త జయపాల్‌రెడ్డి అందించారు.

సోషియాలజీలో రమేష్‌కు డాక్టరేట్

గణేశ్‌నగర్, జూన్15: శాతవాహన యూనివర్సిటీ సోషియాలజీ విభాగంలో పార్ట్ టైం అధ్యాపకుడిగా పని చేస్తున్న మడిపల్లి రమేష్ కాకతీయ యూనివర్సిటీ సోషియాలజీ విభాగం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. అర్బనైజేషన్ అండ్ సస్టెనెబుల్ డెవలప్‌మెంట్ ఇన్ తెలంగాణ స్టేట్- ఎ సోషియాలజికల్ స్టడీ అనే అంశంపై పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ పర్యవేక్షణలో ఆయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నారు. డాక్టర్ రమేష్ 2010లో శాతవాహన యూనివర్సిటీలో పీజీ పూర్తి చేసి, 2012 నుండి అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. 2014లో సెట్‌లో ఉత్తీర్ణత సాధించారు. డాక్టర్ రమేష్ గతంలో పలు జాతీయ అంతర్జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ ను పలువురు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

ఐసెట్‌లో వివేకానంద విద్యార్థుల ప్రతిభ

గణేశ్‌నగర్, జూన్15: ఐసెట్ 2024 ఫలితాల్లో స్థానిక వివేకా నంద డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి సత్తా చాటారని కళాశాల ప్రిన్సిపల్ సిఎచ్. శ్రీనివాస్ తెలిపారు. బీబీఏ విద్యార్థిని ఆకుల సహజ 984, బిబిఏ సిఏ విద్యార్థిని ఆకుల సిరి 1112, బీకాం విద్యార్థి వెన్నం సిద్ధార్థ 4896 ర్యాంకులు సాధించారు. కళాశాలలో మేలో ఉచిత ఐసెట్ శిక్షణ ఇచ్చారు. అందులో శిక్షణ తీసుకున్న రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ జాతీయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ అగ్రికల్చర్ చదివిన కరీం నగర్ వాస్తవ్యుడు చింతల శ్రీశరన్‌కు 3613 ర్యాంకును సాధిం చాడు. పది వేల లోపల 12ర్యాంకులు, 15,000లోపు 22 ర్యాం కులు కళాశాల విద్యార్థులు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన కళాశాల విద్యార్థులను కరస్పాండెంట్ వి.ఆగంరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, రామేశ్వరరావు, ఫిజికల్ సైన్స్ డీన్ మోహన్ ప్రసాద్, భాషా విభాగాధిపతి అలీఖాన్, కామర్స్ విభాగాధిపతి గోపీకృష్ణ, ఫిజిక్స్ విభాగాధిపతి రమేష్, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి కిరణ్‌కుమార్ అభినందించారు.

నేడు 'మరణం వరమైన వేళ' పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, జూన్ 15: భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన 'మరణం వరమైన వేళ' పుస్తకావిష్కరణను ఆదివారం ఉదయం 10 గంటలకు భగత్‌నగర్ భగవతి స్కూల్లో నిర్వహిస్తున్నట్లు గాయకుడు కాసు మహేందర్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా కథారచయిత, తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత పెద్దింటి అశోక్‌కుమార్ హాజరౌతారని పేర్కొన్నారు. వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన క్రైం స్టోరీస్ కథల పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించి సన్మానిస్తామని తెలిపారు. అతిథులుగా ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కలువకుంట రామకృష్ణ, కవి ఐతా చంద్రయ్య, తెరవే రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు గాజోజు నాగభూషణం హాజరౌతారని, స్తంభంకాడి గంగాధర్ పుస్తక పరిచయం చేస్తారని తెలిపారు. కవులు, రచయితలు, కళాకారులు హాజరు కావాలని కోరారు.

ఎల్ఎల్ఎంలో కిమ్స్ విద్యార్థి ప్రతిభ

కరీంనగర్ టౌన్, జూన్ 15: కిమ్స్ లా కళాశాలలో ఎల్ఎల్‌బీ చదువుతున్న విద్యార్థి దిల్‌సాత్ ఎల్ఎల్ఎం ఎంట్రెన్స్ పరీక్షలో రాష్ట్ర స్థాయి 30వ ర్యాంకు సాధించారు. శనివారం 30వ ర్యాంకు సాధించిన దిల్‌సాత్‌ను కళాశాల ఆవరణలో కిమ్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పేర్యాల రవీందర్‌రావు, వైస్ చైర్మన్ సాకేత్‌రామారావు అభినందించారు. ఈకార్యక్రమంలో లా కళాశాల అధ్యాపకులు వెంకటస్వామి, కొమురయ్య, కిషన్, కీర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

కరీంనగర్ టౌన్, జూన్ 15: ఎంఏ మతీన్ తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మిత్ర బృందంతో కలిసి విద్యార్థులకు విద్యాసామాగ్రిని పంపిణి చేశారు. శనివారం నగరంలోని 46వ డివిజన్ ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతినుండి 6వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మతీన్‌తో పాటు ఆయన మిత్ర బృందం పురమల్ల శ్రీనివాస్, వీరారెడ్డి, వంగల పవన్, హరికుమార్‌గౌడ్, మత్తిని సత్యం, నగునూరి వేణు, పెద్ది వేణు, తొడుపునూరికరుణాకర్, మందవిజయ్, సుజాత, కాశెట్టి కిష్టయ్య, బత్తిని అనిల్, కుద్దూస్‌భాయ్, రబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తిమ్మాపూర్, జూన్ 15: మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సుధగోని మల్లయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ మాజీ ఉప సర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ పరామర్శించి 50కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నార్ల అశోక్, సుధగోని, శ్రావణ్, మార్క సారయ్య, సుధగోని వెంకట రమణ, ఖమ్మం వెంకన్న, కొమురయ్య పాల్గొన్నారు.

రైతుబంధు డబ్బులు జమ చేయాలి

గన్నేరువరం, జూన్ 15: వానాకాలం రైతుబంధు డబ్బులు తక్షణమే రైతుల ఖాతాలలో జమచేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు గూడూరి సురేష్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం షరతులు లేకుండా ఎకరానికి రూ.7500 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఘనంగా డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు

జమ్మికుంట, జూన్ 16: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో గల స్పందన అనాథ శరణాలయంలో హుజూరాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ సజ్జద్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెపు సారంగపాణి, పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్, ఎండి రంజాన్, యాట్ల అశోక్, దొడ్డె నవీన్, సతీష్‌రెడ్డి, అశోక్, సంపత్, వెంకటేష్, మహేష్, అంజిరెడ్డి, అఫ్రోజ్, రాజ్‌కుమార్, సురేష్, ఫయాజ్, బాబా పాల్గొన్నారు. కాగా అంబేద్కర్ చౌరస్తాలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

డబ్బులు సకాలంలో అందజేయాలి

శంకరపట్నం, జూన్ 15: ఉపాధిహామీ కూలి డబ్బులు సకాలంలో అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు అన్నారు. శనివారం శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామంలో గ్రామీణ ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాగరాజు, బాబు, మల్లేశం, సంపత్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మహిళ మృతి

ఇల్లందకుంట, జూన్ 15: మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన బోగం దేవేంద్ర (50) వ్యవసాయ పని చేస్తుండగా గుండెపోటు వచ్చి మృతి చెందింది. దేవేంద్ర పొలంలో పనుల చేస్తుండగా ఒక్కసారిగా ఛాతిలో నొప్పి అంటూ కుప్ప కూలిపోయింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందింది.

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్ర వేయాలి

చొప్పదండి, జూన్ 15: పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రను వేయించాలని ఎంపీపీ చిలుక రవీందర్ సూచించారు. శనివారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నులి పురుగుల నిర్మూలనపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వంహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, డాక్టర్ శైలేంద్ర, ఎస్‌హెచ్‌వో ప్రసాద్, రవి నాయక్ పాల్గొన్నారు.